# సాక్షి నంద్యాల

గురువారం । 19 । డిసెంబర్ । 2024




## అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి బుధవారం పత్తికొండకు చెందిన పి.మల్లికార్జునరెడ్డి రూ.1,01,116 విరాళం అందజేశారు.



## మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో శ్రీశైలానికి చెందిన సాయి నృత్య కళాశాల కళాకారులు బుధవారం భక్తి గీతాలకు ప్రదర్శించిన నృత్యం భక్తులను ఆకట్టుకుంది.



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం (అడుగులు) | : 1,633 |
| ప్రస్తుతం | : 1,628.78 |
| సామర్థ్యం (టీఎంసీలు) | : 105.788 |
| ప్రస్తుతం | : 89.602 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 2,310 |
| అవుట్ ఫ్లో | : 6,635 |

# ఆత్మీయ స్వాగతం

- కర్నూలులో వివాహ రిసెప్షన్‌కు హాజరైన వైఎస్ జగన్
- హెలిపాడ్ వద్ద ఘన స్వాగతం పలికిన పార్టీ ఉమ్మడి జిల్లా నేతలు, ప్రజాప్రతినిధులు
- చూసేందుకు భారీగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు



హెలిపాడ్ వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్‌కు బొకేలతో స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కర్నూలులో ఆత్మీయ స్వాగతం లభించింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేంద్ర రెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు బుధవారం ఆయన బెంగళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చారు. ఏపీఎస్పీ క్యాంపులోని హెలిపాడు వద్ద వైఎస్ జగన్‌కు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు బాల నాగిరెడ్డి, విరూపాక్షి, ఎమ్మెల్సీ మధుసూదన్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు సాయిప్రసాద్ రెడ్డి, ఎర్రకోట కేశవ రెడ్డి, కంగాటి శ్రీదేవి, హఫీజ్‌ఖాన్, శిల్పా చక్రపాణి రెడ్డి, శిల్పా రవిచంద్రరెడ్డి, గంగుల బిజేంద్ర నాథ్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి మాజీ ఎంపీలు బుట్టారేణుక, పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మణిగాంధీ, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షురాలు సిత్రా సత్యనారాయణమ్మ, నాయకులు ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, గడ్డం రామకృష్ణ, మద్దూరు సుభాష్ చంద్రబోస్, ఎస్వీ విజయ మనోహరి తదితరులు ఘన స్వాగతం పలికారు. వారికి కరచాలనం చేసి ఆప్యాయంగా పలకరించిన మాజీ సీఎం అక్కడి నుంచి కారులో బళ్లారి చౌరస్తా, ఐటీసీ సర్కిల్ మీదుగా జీఆర్‌సీ కన్వెన్షన్‌కు చేరుకున్నారు. మార్గ మధ్యలో జగనన్నను చూసిన పార్టీ కార్యకర్తలు, అభిమానులు జై జగన్.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



జీఆర్‌సీ కన్వెన్షన్‌లో అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

### వధూవరులను ఆశీర్వదించిన మాజీ సీఎం

నగర శివారులోని జీఆర్‌సీ కన్వెన్షన్‌లో నూతన వధూవరులు డాక్టర్ కె.చతుర, డాక్టర్ జి.నిఖిల్‌కు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. జననేత వచ్చిన విషయం తెలుసుకున్న అభిమానులు ఆయనను చూసేందుకు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. పలువురు సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. భారీ సంఖ్యలో అభిమానులు తరలి రావడంతో కన్వెన్షన్ ప్రాంతం కోలాహలంగా మారింది. అభిమానులకు అభివాదం చేస్తూ మాజీ సీఎం అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులతో కొద్దిసేపు ముచ్చటించారు. తర్వాత ఏపీఎస్పీ క్యాంపులోని హెలిపాడుకు చేరుకొని తాడేపల్లికి బయలు దేరారు. మాజీ సీఎంను కలిసిన వారిలో పార్టీ నాయకులు కోట్ల హరిచక్రపాణిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శశికళ, కాటసాని నరసింహారెడ్డి, ఎస్వీ జనక్‌దత్తా రెడ్డి, షరీఫ్, ఆదిమోహన్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఎల్లారెడ్డి, హనుమంతరెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### డ్రెస్ కోడ్ లేకపోతే జరిమానా

మహానంది: దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న అర్చకులు, రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఏజెన్సీ ఉద్యోగులు డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలని లేకపోతే రూ. 500 జరిమానా విధిస్తామని మహానంది ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ/కమిషనర్ సత్యనారాయణ ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. బుధవారం ఈఓ విలేకరులతో మాట్లాడుతూ సిబ్బంది అందరూ తిలకధారణతో విధులకు హాజరు కావాలన్నారు. అర్చకులు పంచ, కండువా, శిఖతో సంప్రదాయంగా రావాలన్నారు. సిబ్బంది తెల్లచొక్కా, తెల్లపంచ ధరించాలన్నారు. భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, వీఐపీలు వచ్చినప్పుడు ప్రొటోకాల్ పాటించాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు ఒకరోజు వేతనం నిలిపేస్తామన్నారు. భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తే బాధ్యులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శ్రీశైలం చిన్నా, శ్రీనివాసులుకు పలు సూచనలు ఇచ్చారు.

### శ్రీశైలం డ్యాంలోకి 7,870 క్యూసెక్కుల నీరు మళ్లింపు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయంలోకి డ్యాం దిగువ భాగంలో ఉన్న నీటి నుండి 7,870 క్యూసెక్కులను మళ్లించారు. మంగళవారం నుంచి బుధవారం వరకు తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలో మిగులు విద్యుత్‌ను వినియోగించుకొని పంప్ మోడ్ ఆపరేషన్ ద్వారా ఈ ప్రక్రియ చేశారు. అలాగే జలాశయంలో ఉన్న నీటి నుంచి 8,771 క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని 4.070 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. సెల్ఫ్ క్యాచ్‌మెంట్ నుంచి 127 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరింది. అలాగే జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 14,466 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నాగార్జున సాగర్‌కు 8,771 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 1,500 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,695 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బుధవారం సాయంత్రం సమయానికి జలాశయంలో 116.6364 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 863.40 అడుగులకు చేరుకుంది.

### పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



సంజామలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్ రెడ్డి

కోవెలకుంట్ల/ సంజామల: 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి సూచించారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణం, మండలకేంద్రం సంజామలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాల రికార్డులు, మౌలిక వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలపై భయం వీడాలని విద్యార్థులకు సూచించారు. చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి రోజు స్టడీ అవర్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు.సంజామలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించి మెనూ పాటిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, రాజయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల క్రితం మీకు 5 గేదెలు ఉన్నాయి.. ఇప్పుడు వాటి సంతతితో 20 అయ్యాయి. అధికారులు వాటికి ట్యాగ్‌లు వేశారు. వాటికి, వాటి సంతతికి నేటికీ టీకాలు వేస్తున్నారు. ఇలా ఎప్పుడైనా పశుగణనలో మీ పేర్లపై ఆన్‌లైన్‌లో కనిపించినా ఆశ్చర్యపోవద్దు. ఎందుకంటే లేని పశువులను మీ పైరు మీద నమోదు చేసి జిల్లాలో పశు సంపద పెరుగుతుందని చూపించే ప్రయత్నం చేస్తున్నారు పశు సంవర్ధక శాఖ అధికారులు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న పశుగణన అంతా బోగస్‌గా మారిందనే విమర్శలు ఉన్నాయి. పశు సంతతి పక్కాగా లెక్కించి, వ్యాక్సిన్, వాటి సంక్షేమానికి కృషి చేయాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు.

# పశు గణన.. అంతా బోగస్



- లేని పశువులను నమోదు చేస్తున్న వైనం
- రెండు దశాబ్దాలుగా తగ్గుతున్న పశుసంపద
- అయినా.. అధికంగా చూపాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు
- ఆన్‌లైన్‌లోనే కదా... కనీసం 10 శాతం ఎక్కువ చూపాల్సిందేనని ఒత్తిడి



పశుగణనపై సర్వే చేస్తున్న దృశ్యం

**పశు గణన సిబ్బంది వివరాలు**

| కర్నూలు జిల్లా | | నంద్యాల జిల్లా |
|---|---|---|
| 230 | ఎన్యూమరేటర్లు | 326 |
| 56 | సూపర్‌వైజర్లు | 81 |
| **ఈ నెల 17వ తేదీకి గణన ఇలా..** | | |
| 2,71,969 | హౌస్‌హోల్డ్ సర్వే | 2,20,400 |
| 57.44 | శాతం | 57.44 |

కర్నూలు(అగ్రికల్చర్): ఐదేళ్లకోసారి జాతీయ స్థాయిలో పశుగణన చేపడతారు. మొదట 1919-20లో జరిగింది. ప్రస్తుతం 21వ అఖిల భారత పశుగణన చేపట్టారు. ఈ కార్యక్రమానికి విశేషమైన ప్రాధాన్యత ఉంది. గ్రామస్థాయి నుంచి దేశం వరకు నల్ల, తెల్ల జాతి పశువులు, పందులు, గాడిదలు, ఒంటెలు, కుందేళ్లు, కోళ్లు తదితర వాటి సంఖ్య ఎంత ఉందనేది పక్కాగా తేలుతుంది. జాతీయ స్థాయిలో పశువుల సంఖ్యను బట్టి టీకాల తయారీతో పాటు పశు సంపద సంరక్షణకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అయితే పశుగణనలో పారదర్శకత లోపిస్తోంది. లేని పశువులను నమోదు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతస్థాయి నుంచి కింది స్థాయి వరకు లేని పశువులను నమోదు చేసే విధంగా ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశుసంవర్ధక శాఖలో లైవ్‌స్టాక్ లెక్కలన్నీ అంకెల గారడీనేనని డిపార్టుమెంటు సిబ్బందే చెబుతుండటం గమనార్హం. 10-15 ఏళ్లగా పశుసంపద భారీగా తగ్గుతోంది. ఒకప్పుడు వ్యవసాయానికి పశువులే ఆధారం. సాంకేతికత అభివృద్ధి చెందడంతో వాటి వినియోగం 75 శాతం తగ్గిపోయింది. ట్రాక్టర్లు, ఇతర యంత్ర పరికరాలు వినియోగిస్తున్నారు. గ్రామాల్లో పాడిపశువులు తగ్గిపోయాయి. రెండు దశాబ్దాల క్రితం ఒక గ్రామంలో రెండు వేల పశువులు ఉంటే.. నేడు 500కు మించి ఉండటం కూడా గగనమే. గతంలో పాడికి నిలయంగా ఉండే గ్రామాల్లో కూడా 85 శాతం వరకు ప్యాకెట్ పాలే వాడుతున్నారు. క్షేత్రస్థాయిలో ఆవుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కానీ పశుగణనలో మాత్రం పశుసంపద అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. 19వ పశుగణన ప్రకారం ఉమ్మడి జిల్లాలో గేదె జాతి పశువులు 1,20,416 ఉన్నాయి. 20వ పశుగణనలో గేదె జాతి పశువులు 1,26,784 ఉన్నాయి. గ్రామాల్లో పశువులే కనిపించని పరిస్థితి ఉంటే 6,368 గేదె జాతి పశువులు పెరిగినట్లు చూపారు. అన్ని రకాల పశువుల్లో ఇదే తరహా లెక్కలు ఉంటున్నాయి. పశుగణనను పక్కాగా నిర్వహిస్తేనే ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

### 21వ పశుగణనలో కూడా అంకెల గారడీ..

జాతీయ స్థాయిలో అక్టోబరు నెల చివరి వారంలో 21వ అఖిల భారత పశుగణన మొదలైంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 2,500 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్, అర్బన్ ప్రాంతాల్లో ప్రతి 3 వేల ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్ ఉంటారు. ప్రతి ఐదు మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్ వైజర్ ఉంటారు. వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు, ఏరియా హాస్పిటల్స్ ఏడీలు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తారు. జిల్లా స్థాయిలో పశుసంవర్ధక శాఖ అధికారి పర్యవేక్షిస్తారు. కర్నూలు జిల్లాలో 230 మంది ఎన్యూమరేటర్లు, 56 మంది సూపర్‌వైజర్లు, నంద్యాల జిల్లాలో 326 మంది ఎన్యూమరేటర్లు, 81 సూపర్‌వైజర్లు ఇందులో భాగస్వాములయ్యారు. ఇది వరకు జరిగిన వాక్సినేషన్ కార్యక్రమాలన్నీ 20వ పశుగణన ప్రకారం వంద శాతం జరిగినట్లు చూపారు. ఇప్పుడు పశుగణనలో పశుసంపద తగ్గితే సమాధానం చెప్పలేని పరిస్థితి ఉంటుందని లెక్కలు మారకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'మీరేం చేస్తారో తెలియదు.. 20వ పశుగణన కంటే 10 శాతం ఎక్కువగా పశువులను నమోదు చేయాలి' అని ఆదేశాలు వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పశువులు లేకపోయినా ఉన్నట్లు నమోదు అవుతున్నాయి. పశ్చిమ ప్రాంతమైన ఆదోని, పత్తికొండ డివిజన్‌లతో 15 ఏళ్ల క్రితంతో పోలిస్తే 60 శాతం పైగా పశువులు తగ్గాయి. 19వ పశుగణనతో పోలిస్తే 20వ పశుగణనలో పెరిగాయి. 21వ పశుగణనలో కూడా ఆన్‌లైన్‌లో అంకెల గారడీ చేసి పెంచుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కొంతమంది ఎన్యూమరేటర్లు ఇళ్లలో కూర్చొనే ఆన్‌లైన్‌లో అంకెలు నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది.

> 'మీరు ఏమి చేస్తారో మాకు తెలియదు. 20వ పశుగణన కంటే పశువుల సంఖ్యను ఎక్కువే చూపాలి.. లేదా అదే స్థాయిలోనైనా చూపించాలి.. ఎంత మాత్రం తక్కువ చూపరాదు.. క్షేత్రస్థాయిలో పశువులు ఉన్నాయా.. లేదా అనే దానిని పట్టించుకోవద్దు... ఆన్‌లైన్‌లో ఉన్నట్లు నమోదు చేయాలి' ఇది ప్రస్తుతం జరుగుతున్న 21వ పశుగణన నుద్దేశించి రాష్ట్ర హెచ్‌వోడీలు వీడియో, జూమ్ కాన్ఫరెన్స్‌ల్లో జిల్లా పశుగణన సిబ్బందికి చేసిన సూచనలు ఇవి. దీంతో పశుగణన అంతా బోగస్సేనని తెలుస్తోంది.

### గడువున్నా హడావుడిగా..

పశుగణన పారదర్శకంగా ఉండాలనే లక్ష్యంతో ఫిబ్రవరి చివరి వరకు కేంద్ర ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. కాని పశుసంవర్ధక శాఖ హడావుడిగా ఇప్పటికే దాదాపు 60 శాతం పూర్తి చేయడం గమనార్హం. అంకెల గారడీకి పాల్పడుతుండటంతో ఈ ప్రగతి ఉన్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అక్టోబరు చివరి వారంలో పశుగణన మొదలైనప్పటికీ వాస్తవంగా క్షేత్రస్థాయిలో మొదలైంది మాత్రం నవంబరు మొదటి వారంలోనే. కానీ ఇప్పటికే దాదాపు 60 శాతం పశుగణన పూర్తయినట్లు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. కర్నూలు జిల్లాలో ఈ నెల 17వ తేదీ నాటికి 57.44 శాతం పూర్తయి, 271,969 హౌస్‌హోల్డ్ సర్వే చేశారు. నంద్యాల జిల్లాలో 51 శాతం కాగా, 2,20,400 హౌస్‌హోల్డ్‌ల్లో ఎన్యూమరేషన్ పూర్తయింది. పశుగణన చేసినట్లు ప్రతి ఇంటికి స్టిక్కర్ అతికించాల్సి ఉంది. పశుసంవర్ధక శాఖలో క్షేత్రస్థాయిలో ఏమి ఉండదు. ఆన్‌లైన్‌లో మాత్రం అన్ని చేసినట్లుగా ఉంటుంది. పశువులతో పాటు, సన్న జీవాలన్నిటికీ ట్యాగ్‌లు (చెవులకు పోగు) వేయాల్సి ఉంది. పశువుల్లో 20 శాతం పశువులకు, సన్న జీవాల్లో 10 శాతం వరకు కూడా ట్యాగ్‌లు కనిపించవు. కాని వంద శాతం ట్యాగ్‌లు వేసినట్లు ఆన్‌లైన్‌లో ఉంటుంది.

### ఉన్నది ఉన్నట్లు నమోదు చేస్తున్నాం



జిల్లాలో 21వ పశుగణన పకడ్బందీగా జరుగుతోంది. ఇప్పటికే 65 శాతం పూర్తయింది. లేని పశువులను నమోదు చేస్తున్నారనే విమర్శల్లో ఎలాంటి నిజం లేదు. 20వ పశుగణన కంటే ఎక్కువ నమోదు చేయాలని ఆదేశాలు లేవు. పశుగణనను డాక్టర్లు ఏడీలు పర్యవేక్షిస్తున్నారు. తాను కూడా తనిఖీలు చేస్తున్నాను. ఎక్కడ తేడాలు కనిపించ లేదు.

– జి. శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, కర్నూలు

# చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రండి

నంద్యాల: జిల్లాలో చిన్న పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. జిల్లా పరిశ్రమల మేనేజర్ జవహర్ బాబు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు సృష్టించే పారిశ్రామిక రంగ అభివృద్ధికి సంబంధిత అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఏపీఐఐసీ పారిశ్రామిక వాడల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం, స్టాండ్ అఫ్ ఇండియా కింద నిర్దేశించిన 66 యూనిట్ల లక్ష్యాన్ని అధిగమించినట్లు చెప్పారు. ఎంఎస్ఎంఈ యూనిట్ల స్థాపనకు స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత గడువు లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద ఇప్పటి వరకు 6576 యూనిట్లు మంజూరు చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు.

### వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం వివిధ వృత్తి నైపుణ్య రంగాల్లో శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా నైపుణ్య కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు.

# ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకోవాలి

- ఆర్ఏఆర్ఎస్ కిసాన్ మేళాలో మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి



శాస్త్రవేత్తలు ఆవిష్కరించిన కొర్ర, జొన్న కంకులను పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు

నంద్యాల(అర్బన్): మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం మైదానంలో బుధవారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఆర్ఏఆర్ఎస్)ఆధ్వర్యంలో 'కిసాన్ మేళా' నిర్వహించారు. అతిథులుగా హాజరైన మంత్రులు, జిల్లా కలెక్టర్ రాజకుమారి ఈ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయం ద్వారా అధిక దిగులు సాధించడానికి వీలుంటుందన్నారు. అయితే, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం బాధాకరమన్నారు. శాస్త్రవేత్తలు ఎంతో కష్టపడి ఎక్కువ దిగుబడి సాధించే శనగ, కొర్ర, ప్రొద్దు తిరుగుడు, మొక్క జొన్న వంటి నూతన వంగడాలను తీసుకొస్తున్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రైతు బిడ్డగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకుని ఆ ఫలితాలు ఆధారంగా పంటలు వేసుకోవాలన్నారు. అనంతరం మేళాలో ప్రదర్శించిన వ్యవసాయ ఉత్పత్తులు, స్టాల్స్‌ను వారు పరిశీలించారు. వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు చేస్తున్న శాస్త్రవేత్తలు, పరిశోధకులను సన్మానించారు. కార్యక్రమంలో పాణ్యం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, గిత్త జయసూర్య, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ ఏడీఆర్ డాక్టర్ ఎం.జాన్సన్, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం బోర్డు మాజీ సభ్యులు భగీరథ చౌదరి, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, రైతులు పాల్గొన్నారు.

# బిల్లు చెల్లింపు మరింత సులభం

- క్యూఆర్ కోడ్ విధానానికి శ్రీకారం చుట్టిన విద్యుత్ శాఖ
- పైలట్ ప్రాజెక్టుగా తిరుపతి
- వచ్చే నెల నుంచి జిల్లాలో అమలు



**కర్నూలు న్యూసిటీ:** ఏపీఎస్పీడీసీఎల్ డిస్కం.. విద్యుత్ వినియోగదారులకు బిల్లుల చెల్లింపును సులభతరం చేయనుంది. వినియోగదారుల కోసం కరెంట్ బిల్లుపై క్యూఆర్ కోడ్ ముద్రించి బిల్లులు చెల్లించేందుకు ప్రత్యేక డిజిటల్ విధానాన్ని రూపొందించింది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా బిల్లులు చెల్లించవచ్చని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత డిసెంబరు నుంచే ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు.

**కొన్ని నెలలుగా ఆగిన యూపీఐ సేవలు**

ఈ ఏడాది జూన్ వరకు యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లుగా ఉన్న గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ తదితర మార్గాల ద్వారా కరెంట్ బిల్లులు చెల్లించడానికి వెసులుబాటు ఉండేది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాలతో విద్యుత్ సంస్థలు ఆ ప్లాట్‌ఫారాల సేవలు నిలిపివేశాయి. ఈ పద్ధతి అమలులో ఉన్నప్పుడు విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వినియోగదారులకు సులువుగా ఉండేది. ఆర్బీఐ ఆదేశాల నేపథ్యంలో యూపీఐ సర్వీస్ ప్రొవైడర్ల సేవలు దూరమయ్యాయి.

**జాప్యం, చార్జీల కారణాలతో..**

యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లుగా ఉన్న సంస్థలకు వినియోగదారులు చెల్లించే నగదు వెళ్లేది. అక్కడి నుంచి ఏపీ డీసీఎల్ ఖాతాలకు రీ–డైరెక్ట్ చేసేవారు. అయితే ఆ సర్వీస్ ప్రొవైడర్ల నుంచి సకాలంలో ఏపీఎస్పీడీసీఎల్ ఖాతాలకు జమ కాలేదు. దీనివల్ల ఏపీఎస్పీడీసీఎల్ నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేగాకుండా యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లకు ఏపీఎస్పీడీసీఎల్ వల్ల ఎక్కువ ఆదాయం కూడా ఉండేది. ఉదాహరణకు విద్యుత్ వినియోగదారుడు యూపీఐ సర్వీస్ ప్రొవైడర్ ద్వారా బిల్లు చెల్లిస్తే అందులో ఓ కనెక్షన్‌కు రూ.2.50 కమీషన్ ప్రొవైడర్లకు దక్కేది. మిగతా మొత్తం ఏపీఎస్పీడీసీఎల్ సంస్థకు అందేది. ఇందులో కూడా జాప్యం చేస్తున్న కారణంగానే ఆర్బీఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ రెండు కారణాల వల్లే యూపీఐ సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా బిల్లులు చెల్లించే పద్ధతిని రద్దు చేశారు.

**కౌంటర్ల పెంపుతో ఊరట..**

ప్రత్యామ్నాయంగా విద్యుత్ బిల్లులను పాత పద్ధతిలోనే మీసేవ కేంద్రాలు, ఏపీఎస్పీడీసీఎల్ సబ్‌స్టేషన్ల వద్ద ప్రత్యేకంగా విద్యుత్ బిల్లుల వసూలుకు కౌంటర్లను పెంచారు. కౌంటర్ల పెంపు కాస్త ఊరట ఇచ్చినప్పటికీ సబ్ స్టేషన్ వద్ద బిల్లులు చెల్లించడానికి బారులుతీరాల్సి వస్తుంది. ఇక్కడ అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేనప్పటికీ మీసేవ కేంద్రాల వద్ద మాత్రం సర్వీస్ చార్జ్ రూ.5 చెల్లించాల్సి ఉంటుంది.

**జిల్లాలో విద్యుత్ సర్వీసులు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గృహ అవసర విద్యుత్ కనెక్షన్లు 11.56 లక్షలు ఉన్నాయి. వాణిజ్య కనెక్షన్లు 1,32,223, చిన్న, మధ్య, పెద్ద పరిశ్రమల విద్యుత్ సర్వీసులు 7,867, పబ్లిక్ సర్వీస్ కనెక్షన్లు 24,129, హెచ్‌టీ కనెక్షన్లు 719 ఉన్నాయి. అలాగే జిల్లా ప్రజలు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కేవీఆర్ కళాశాలకు ఎదురుగా ఉన్న ఆపరేషన్స్ సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో కౌంటర్లు ఉన్నాయి. వీటితోపాటు విద్యుత్ భవన్ వద్ద బీరోడ్, పాత నగరం, బీక్యాంపు, వెంకటరమణ కాలనీ సబ్‌స్టేషన్ల ఏఈ కార్యాలయాల వద్ద విద్యుత్ వసూలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**తిరుపతిలో ప్రయోగాత్మకంగా క్యూఆర్ కోడ్ విధానం**

విద్యుత్ బిల్లుల చెల్లింపు ప్రక్రియను సరళతరం చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ నిర్ణయించింది. ఈక్రమంలో తిరుపతి నగరంలో ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈనెల (డిసెంబర్) నుంచి జారీ చేసే కరెంట్ బిల్లుల పైభాగంలో క్యూఆర్ కోడ్ ముద్రించనున్నారు. ఈ కోడ్ స్కాన్ చేయడం ద్వారా నగదు చెల్లింపులకు ఆస్కారం కల్పించనున్నారు. తిరుపతి ఫలితాలను సమీక్షించిన తర్వాత రాయలసీమ, నెల్లూరు, జిల్లాతోపాటు కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో అమలు చేయనున్నారు. కాగా తెలంగాణ రాష్ట్రంలోకి కొన్ని జిల్లాల్లో ఇప్పటికే ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు.



**వచ్చే నెలలో మన జిల్లాలో క్యూఆర్ కోడ్ బిల్లులు ఇస్తారు**



క్యూఆర్ కోడ్ విద్యుత్ బిల్లుల విధానాన్ని మొదటగా పైలట్ ప్రాజెక్టుగా తిరుపతి జిల్లాలో పరిశీలిస్తున్నారు. అక్కడ సాధ్యాసాధ్యాలను పరిశీలించి విజయవంతం చేసేందుకు విద్యుత్ శాఖ ప్రయత్నిస్తోంది. అక్కడ విజయవంతమైతే జిల్లాలో క్యూఆర్ కోడ్ విద్యుత్ బిల్లులు వినియోగదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే నెల నుంచి జిల్లా వినియోగదారులకు క్యూఆర్ కోడ్ విద్యుత్ బిల్లు రావచ్చని భావిస్తున్నాం.

– ఉమాపతి, విద్యుత్ ఎస్ఈ

## క్లుప్తంగా

### 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

**నందికొట్కూరు:** పట్టణంలోని నీలిషికారిపేటలో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 500 లీటర్ల బెల్లం ఊటను బుధవారం ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ సిబ్బందితో కలిసి ధ్వంసం చేశారు. షికారి దుర్గ వద్ద నుంచి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా నాటు సారా తయారు చేయడం నేరమన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా, ఇతర ప్రాంతాలకు తరలించినా క్రిమినల్ కేసులతోపాటు వాహనాలు సీజ్ చేసి జైల్‌కు పంపుతామని హెచ్చరించారు. సోదాల్లో ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు కుమారి, శంకర్ నాయక్, పద్మనాభం, పోలీసులు శివన్న, సుధీర్, కుమార్ పాల్గొన్నారు.

### ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని మహిళ దుర్మరణం

**ఓర్వకల్లు:** ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొనడంతో ఓ మహిళ దుర్మరణం చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్నూలు మండలం బి.తాండ్రపాడు సమీపంలో ఉన్న క్రైడో కార్పొరేట్ స్కూల్‌కు చెందిన బస్సు.. రాగమయూరిలోని విద్యార్థులను వదిలేందుకు బయలుదేరింది. రోడ్ నంబర్ 16లోని క్లాసిక్ అపార్ట్‌మెంట్ వద్ద డ్రైవర్ నిర్లక్ష్యంగా రివర్స్ తిప్పేక్రమంలో నన్నూరు గ్రామానికి చెందిన గొల్ల శ్రీనివాసులు భార్య చంద్రమ్మ(50)ను ఢీకొంది. ప్రమాదంలో మహిళ తలకు, కుడి చేతికి బలమైన రక్త గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సునీల్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### నాగలదిన్నె ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం మృతి



బాబురాజు(ఫైల్)

**నందవరం:** మండలంలోని నాగలదిన్నె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బాబురాజు(55) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృత్యువాత పడ్డారు. నాగలదిన్నెలోని ఎంపీపీ స్కూల్‌లో గత 5 సంవత్సరాల నుంచి హెచ్‌ఎంగా విధులు నిర్వహించేవారని, యూటీఎఫ్ నాయకుడిగా, ఉపాధ్యాయుడిగా, హెచ్‌ఎంగా అందించిన సేవలు మరువలేనివని, ఆయన మృతి దిగ్భ్రాంతిని కలిగించిదని యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఎల్లప్ప అన్నారు.

### మట్కా బీటర్ల అరెస్ట్

- రూ.లక్ష నగదు, 60 లీటర్ల నాటుసారా స్వాధీనం

**ఆదోని అర్బన్:** పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా బీటర్లపై పోలీసులు దాడులు చేశారు. బుధవారం మట్కా బీటర్లు ఖాదర్, ఖాన్‌తోపాటు మరో నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.లక్ష నగదు, పేకముక్కలతోపాటు 60 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపారు.

### బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

**కోసిగి:** మండల పరిధిలోని పల్లెపాడు గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందగా మరో యువకుడు తీవ్రగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. నందవరం మండలం బాపురం గ్రామానికి చెందిన బోయ వీరేష్(26), స్నేహితుడు రాజశేఖర్‌తో కలిసి బైక్‌పై కౌతాళం మండలం చిరుతపల్లి గ్రామంలో జరిగే దేవరకు హాజరయ్యారు. కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని సాయంత్రం బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. పల్లెపాడు గ్రామ సమీపంలో జిల్లా పరిషత్ స్కూల్ మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో ఇద్దరూ కింద పడ్డారు. ప్రమాదంలో వీరేష్ అక్కడికక్కడే మృతి చెందగా రాజశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతినికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం.

## ఉపాధ్యాయులకు తలనొప్పిగా ఎస్‌ఏ–1 పరీక్షలు



పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచిన పశ్నాపత్రాలు తీసుకుంటున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

**ఆలూరు రూరల్:** పరీక్షలు నిర్వహించాలంటే ఉపాధ్యాయులు హడలెత్తిపోతున్నారు. ప్రతిరోజు పరీక్షకు గంట ముందు ఎంఈఓ కార్యాలయం వద్దకు వెళ్లి అక్కడి నుంచి పోలీసు స్టేషన్‌లో భద్రపరిచిన పరీక్షా పత్రాలు తెచ్చుకోవాల్సి ఉంది. రోజు రెండు సార్లు ఉదయం,మధ్యాహ్నం ప్రశ్న పత్రాలు తెచ్చుకుంటున్నారు. ఆయా మండల కేంద్రాల్లోని ఉపాధ్యాయులకు వెసులుబాటు ఉంటుంది. కానీ గ్రామాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులకు వెసులుబాటు ఉండదు. ఒక్కొ గ్రామం మండల కేంద్రానికి 5 నుంచి 25 కిలో మీటర్లు దూరం కూడా ఉన్నాయి. దీంతో ఉపాధ్యాయులు అంత దూరం రెండు సార్లు వెళ్లి ప్రశ్న పత్రాలు తీసుకురావాలంటే తలకు మించిన భారంగా మారింది.

**పోలీసు స్టేషన్ నుంచే ప్రశ్నపత్రాల పంపిణీ**

ఎస్‌ఏ–1 పరీక్షలలో భాగంగా సోమవారం జరగాల్సిన లెక్కల పరీక్ష లీక్ కావడంతో ప్రభుత్వం ఆ పరీక్షను రద్దు చేసింది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రశ్న పత్రాలను ఎంఈఓ కార్యాలయం నుంచి పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. దీంతో మంగళవారం నుంచి అన్ని పాఠశాలలలకు ప్రశ్నా పత్రాలు ఉపాధ్యాయులకు ఎంఈఓ ఆధ్వర్యంలో సిబ్బంది పంపిణీ చేస్తున్నారు.

## దేశాభివృద్ధికి విద్యావ్యవస్థ కీలకం



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్

**పాణ్యం:** దేశాభివృద్ధికి విద్యావ్యవస్థ కీలకమని రాజమండ్రి స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ శంకర్ అన్నారు. బుధవారం నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేషనల్ ఇంటిగ్రేటెడ్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భారత సంస్కృతి ప్రపంచంలోనే ఎంతో గొప్పదన్నారు. ప్రపంచానికి విలువైన మేధావులను, సాంకేతిక శాస్త్రవేత్తలను అందించిన ఘనత మనదేనన్నారు. మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశంలో విద్యావ్యవస్థ అభివృద్ధి చెందితే దేశం బలంగా ఉంటుందన్నారు. పురాతన ఆలయాల్లో సాంకేతిక నిర్మాణంపై ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో అధ్యయనాలు జరిగాయన్నారు. నేటి విద్యార్థులు అధ్యాపకుల ద్వారా సరైన విద్యను పొందలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో డీన్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, డాక్టర్ సోఫియా, ప్రియదర్శిని పాల్గొన్నారు.

### 21లోగా ఇంటర్న్‌షిప్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**కర్నూలు కల్చరల్:** రాయలసీమ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ ఆరో సెమిస్టర్ విద్యార్థులు సెమిస్టర్ లాంగ్ ఇంటర్న్‌షిప్ రిజిస్ట్రేషన్లను ఈనెల 21వ తేదీలోగా పూర్తి చేయాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ సూచించారు. బుధవారం వీసీ చాంబర్‌లో వర్సిటీ పరిధిలోని కర్నూలు, నంద్యాల జిల్లాల కళాశాలల విద్యార్థుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఇంటర్న్‌షిప్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణతో సమీక్షించారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు సంబంధిత కళాశాలల్లో ఇంటర్న్‌షిప్ రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. ఉన్నత విద్యామండలి గుర్తించిన సంస్థల్లోనే తప్పనిసరిగా ఇంటర్న్ షిప్ రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు మాట్లాడుతూ వర్సిటీకి అనుబంధంగా ఉమ్మడి జిల్లాలోని 92 డిగ్రీ కళాశాలల్లో బీఏ కోర్సుల కాంబినేషన్‌లో 1422, బీకాం కోర్సుల కాంబినేషన్‌లో 3481, బీఎస్సీ కోర్సుల కాంబినేషన్‌లో 2965, ఇతర కోర్సుల్లో 586 మందితో కలిపి మొత్తం 8454 మంది విద్యార్థులు ఈ సంవత్సరం ఇంటర్న్ షిప్ చేయాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు సుమారు 4 నెలల పాటు ఇంటర్న్ షిప్ కొనసాగించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు తమ ఇంటర్న్ షిప్‌ల పురోగతిని నిర్దేశించిన ప్రొఫార్మాలో పూర్తి చేసి వర్సిటీకి సమర్పించాల్సి ఉంటుందని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు అన్నారు. అప్పుడు మాత్రమే ఆ విద్యార్థులకు సెమిస్టర్ చివర్లో వైవా, పరీక్షలు నిర్వహించడానికి వీలవుతుందన్నారు. మరింత సమాచారం కోసం వర్సిటీలోని నోడల్ ఆఫీసర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### విద్యుత్ తీగలు చోరీ

**కొలిమిగుండ్ల:** మండల కేంద్రంలోని పలువురి రైతుల పొలాల్లో బుధవారం గుర్తుతెలియని దుండగులు విద్యుత్ తీగలు చోరీ చేశారు. ఇటీవల వరుసగా తీగలు అపహరించుకుపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు చెన్నయ్య, బాలుడు, చిన్ని, నాగేశ్వరరావు, నరసింహుడు బోర్ల కింద వరి, మిరప పంటలు సాగు చేశారు. మోటార్ల నుంచి స్టార్టర్ల వరకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ తీగలను కట్ చేసి తీసుకెళ్లిపోయారు. ఒక్కొక్కరి పొలంలో 20 నుంచి 30 మీటర్ల మేర తీగలు తీసుకెళ్లారని రైతులు పేర్కొన్నారు. పంటలకు తప్పనిసరిగా నీళ్లు పారించుకోవాల్సి రావడంతో కొత్తగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుందన్నారు. కొద్ది రోజుల నుంచి కొంత మంది పనిగట్టుకొని చోరీకి పాల్పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

● **సంజామల:** మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామానికి చెందిన రైతుల మోటార్ల కేబుల్ వైర్లు బుధవారం చోరీకి గురయ్యాయి. దాదాపు 20 మంది రైతుల వైర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. వైర్ల విలువ రూ.50 వేలు ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంలో ఆకుమల్ల, హోత్రమాన్‌దిన్నె, కమలపురి గ్రామాల్లో వరుసగా మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురైన సంగతి తెలసిందే. పోలీసులు దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచి పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

### 21న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు



మాట్లాడుతున్న జిల్లా నెట్‌బాల్ సంఘం వ్యవస్థాపకులు కె.నాగరత్నమయ్య

**కర్నూలు (టౌన్):** ఈనెల 21, 22 తేదీల్లో స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా నెట్‌బాల్ సంఘం వ్యవస్థాపకులు కె.నాగరత్నమయ్య తెలిపారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 28న చెన్నైలో నిర్వహించనున్న జాతీయ స్థాయి నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టు పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వరబాబు, ఆర్చరీ ట్రైనర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి మహానందీశ్వరుడి దర్శన వేళల్లో మార్పులు



మహానందీశ్వరస్వామి నిజరూపం

**మహానంది:** మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్ల దర్శనం వేళల్లో శుక్రవారం నుంచి స్వల్ప మార్పులు జరగనున్నాయి. ఇప్పటిదాక ఉదయం నుంచి రాత్రి 9.30 గంటల వరకు వరకు స్వామి, అమ్మవారి దర్శనం నిర్విరామంగా కొనసాగుతూ వస్తుంది. అయితే ఆలయ ఆచార వ్యవహారాలకు సంబంధించి వైదిక కమిటీ తీర్మానించిన మేరకు మధ్యాహ్నం 12.30 నుంచి 2.00 గంటల వరకు అంటే గంటన్నర పాటు విరామం ఇవ్వనున్నారు. రేపటి నుంచి ఈమార్పును అమల్లోకి తెస్తున్న ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్నం 2.00గంటల నుంచి భక్తులకు యథావిధిగా దర్శనం కొనసాగుతుందని, ఆలయం బయట ఉన్న రెండు చిన్నకోనేరుల్లో స్నానాలకు సైతం అనుమతి ఉంటుందన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణాల్లో కర్నూలు టాప్

- పీఆర్ ఎస్ఈ వీ రామచంద్రారెడ్డి

**కర్నూలు(అర్బన్):** జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాల్లో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని పంచాయతీరాజ్ ఎస్ఈ వీ రామచంద్రారెడ్డి చెప్పారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ మొత్తం 803 పనులకు గానూ ఇప్పటి వరకు 491 పనులు ఫిజికల్‌గా పూర్తయ్యాయన్నారు. పత్తికొండ సబ్ డివిజన్‌లో 72.73 శాతం, కోడుమూరులో 73.68, పాణ్యంలో 76.47, ఆదోనిలో 73.33, ఆలూరులో 66.50, మంత్రాలయంలో 55.56, ఎమ్మిగనూరులో 81.67 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఇదే వేగాన్ని కొనసాగిస్తే ఈ నెలాఖరు నాటికి వంద శాతం లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. వెనుకబడిన ఆలూరు, మంత్రాలయం సబ్ డివిజన్లలో పనుల వేగం పెంచాలని క్షేత్ర స్థాయిలోని ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. బిల్లులను అప్‌లోడ్ చేసిన వెంటనే నిధులు విడుదలవుతున్నాయన్నారు. నాబార్డు కింద చేపట్టిన పనుల పెండింగ్ బిల్లులు దాదాపు రూ.34 కోట్లు కూడా త్వరలోనే విడుదల కానున్నాయన్నారు. పీఎంజీఎస్‌వై కింద కింద పెండింగ్‌లో ఉన్న రూ.2 కోట్లు రెండు, మూడు రోజుల్లో విడుదలయ్యే అవకాశం ఉందన్నారు.

## కొనసాగుతున్న పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు



హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు



బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు

**నంద్యాల(న్యూటౌన్):** స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం రెండో రోజు క్రీడాపోటీలు కొనసాగాయి. చెస్ బాలికల విభాగంలో దివ్య(బేతంచెర్ల), బ్యాడ్మింటన్ డబుల్స్ బాలుర విభాగంలో అజయ్‌కుమార్, అమీర్(కేవీఎస్ఆర్ కర్నూలు), బాలికల విభాగంలో ప్రవల్లిక, ఎస్.అంజుమ్(నంద్యాల) అథ్లెటిక్స్ 200 మీటర్స్ రన్ బాలికల విభాగంలో అఖిల(బేతంచెర్ల), బాలుర విభాగంలో సూరజ్‌కుమార్(కర్నూలు), 400 మీటర్స్ రన్ బాలికల విభాగంలో స్పందన(నంద్యాల), బాలుర విభాగంలో హరిప్రసాదరెడ్డి(నంద్యాల), జవాలీన్ త్రో బాలుర విభాగంలో ఎస్.కృష్ణనాయక్(శ్రీశైలం) విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు.

## ప్రేమజంటపై దాడిలో ట్విస్ట్

- మొదటి ప్రియుడిని అడ్డు తొలగించుకునేందుకు రెండో ప్రియుడితో ప్రియురాలి పథకం?
- రెండు రోజుల ముందుగానే రెక్కీ నిర్వహించిన యువతి



గాయపడిన అరవింద్ (ఫైల్)

**గోనెగండ్ల:** గాజులదిన్నె ప్రాజెక్టు సమీపంలో ప్రేమజంటపై జరిగిన దాడి ఘటనలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. యవకుడిపై దాడి వెనుక యువతి ఉన్నట్లు సమాచారం. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన అరవింద్ డిస్టెన్స్ డిగ్రీ చదువుతున్నాడు. అరవింద్ ఇంటర్ చదివే సమయంలో ఓ అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. ఇద్దరి మధ్య ప్రేమ పెళ్లి వరకు వచ్చింది. విషయం తెలుసుకున్న అమ్మాయి కుటుంబ సభ్యులు మందలించడంతో విరమించుకున్నారు. ప్రస్తుతం అమ్మాయి ఓ కళాశాలలో బీటెక్ చదువుతోంది. అదే కళాశాలలో మరో అబ్బాయితో ప్రేమలో పడింది. ఒకరికి తెలియకుండా మరొకరితో మాట్లాడుతూ ఇద్దరితోనూ ప్రేమాయణం నడుపుతోంది. ఇటీవల మొదటి ప్రియుడి విషయం తెలుసుకున్న రెండవ ప్రియుడు.. యువతిని నిలదీయడంతో తప్పును కప్పిపుచ్చుకునేందుకు తాను ప్రేమించడం లేదని, అతడే వేధిస్తున్నాడని చెప్పింది. ఈక్రమంలో రెండో ప్రియుడితో కలసి మొదటి ప్రియుడు అరవింద్‌పై దాడికి కుట్ర పన్నారు. రెండు రోజులు ముందుగానే గాజులదిన్నె ప్రాజెక్టు వద్దకు వచ్చి రెక్కీ నిర్వహించుకుని వెళ్లింది. మంగళవారం అరవింద్‌ను గాజులదిన్నె ప్రాజెక్టు వద్దకు తీసుకెళ్లింది. ఇదే విషయాన్ని ఫోన్‌లో మెసేజ్ ద్వారా ఎప్పటికప్పుడు రెండవ ప్రియుడికి సమాచారం ఇచ్చింది. అతడు తన స్నేహితులతో కలిసి వేటకొడవళ్లతో అక్కడికి చేరుకుని అరవింద్‌పై దాడి చేశారు. యువతి అక్కడి నుంచి పారిపోయింది. అరవింద్ కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు కాపాడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా విచారణలో యువతిదే పక్కా ప్లాన్ అని తెలిసి పోలీసులు అవాక్కయినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై సీఐ గంగాధర్ మాట్లాడుతూ ప్రేమజంటపై దాడి ఘటనను విచారిస్తున్నామని, గురువారం వివరాలు మీడియాకు వెల్లడిస్తామని చెప్పారు.





## గాలేరు లైనింగ్ పనులు గాలికి!

- పెండింగ్ పనులను పట్టించుకోని కూటమి సర్కార్



జీరో రెగ్యులేటర్ నుంచి డ్రాప్ కం రెగ్యులేటర్ వరకు నిలిచిపోయిన లైనింగ్ పనులు

**పాణ్యం:** గాలేరు నగరి లైనింగ్ పనులను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. కృష్ణా జలాలు కడలిలో కలవకుండా రాయలసీమ జిల్లాలకు తరలించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గాలేరు నగరి సుజల స్రవంతి పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ కాల్వ ద్వారా పోతిరెడ్డిపాడు, బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వరకు అక్కడి నుంచి గోరుకల్లు జలాశయంలోకి నీరు వచ్చి చేరుతుంది. గోరుకల్లు నుంచి నగరికి 30 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో దిగువకు నీటిని తరలించేందుకు కాల్వను డిజైన్ చేసి పనులు ప్రారంభించారు. వైఎస్సార్ పాలనలో 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఆయన మరణాంతరం వచ్చిన ప్రభు త్వాలు ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశాయి. 2014లో వచ్చిన టీడీపీ ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న కాల్వలో 2017 నవంబర్ 6న గోరుకల్లు నుంచి అవుకు వరకు నీటిని వదిలారు. అయితే కాల్వ వెంట లీకేజీలు, అసంపూర్తి పనులు వల్ల అనుకున్న లక్ష్యం నెరవేరలేదు.

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో వేగంగా లైనింగ్ పనులు**

గాలేరు నగరి సుజల స్రవంతి కాల్వల లీకేజీలను అరికట్టేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టింది. 2021 ఫిబ్రవరిలో గోరుకల్లు జీరో రెగ్యులేటర్ నుంచి అవుకు టన్నెలు మొదలుకొని దాదాపు 57.7 కిలోమీటర్ల పనులు ప్రారంభించారు. ఇందుకు రూ.1,269 కోట్లు మంజూరు చేశారు. లైనింగ్ పనులు అన్ని చోట్లా పూర్తి చేశారు. జీరో రెగ్యులేటర్ వద్ద, అవుకు టన్నెల్‌లో కొంతభాగం పెండింగ్‌లో ఉంది. ఈలోపు ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి.

**పెండింగ్‌లోనే పనులు..**

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం లైనింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. పనులు పురోగతి, చేయాల్సిన పనులపై ఇంతవరకు సమీక్ష నిర్వహించకపోవడం, ముందుకు వెళ్లే ప్రణాళికలు రూపొందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెండింగ్ పనులతోపాటు గోరుకల్లు ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**పెండింగ్ పనులపై నోటీసులు ఇస్తున్నాం**

గాలేరు నగరి లైనింగ్ పనులపై కాంట్రాక్టర్లకు నోటీసులు ఇస్తున్నాం. ఇప్పటికే పలుమార్లు సమాచారం ఇచ్చాం. పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. కాంట్రాక్టర్లు రాని విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పనులు జరిగేలా చూస్తాం. – సురేష్ ఈఈ